# ఇలాంటి కొడుకులూ ఉన్నారు!!

షాహీరాన్

"ఒసే రాజ్యం! ఎక్కడ చచ్చావ్? పిల్లలు లేచారు! బెడ్ కాఫీ ఇవ్వాలని తెలీదూ?" అంటూ విన్పించడంతో ఠక్కున లేచాడు రాజ్యం భర్త లక్ష్మీకాంతం.

"ప్రతిరోజూ విన్పించే సుప్రభాతం ఇదే కదా" అని విసుక్కుంటూ మంచం దిగాడు. అప్పుడే రాజ్యం కాఫీలు పట్టుకుని గబగబా తన చెల్లెళ్ళ రూమ్‌వైపు పరుగులు పెట్టడం కన్పించింది. అతని మనసు చివుక్కుమంది. తనతో పెళ్ళయిన పాపానికి తన భార్య అనుభవిస్తున్న నరకం చూసి ఎంతో బాధపడ్డాడు. కాలకృత్యాలు తీర్చుకోడానికి బాత్‌రూమ్‌లోకి దూరాడు. స్నానం పూర్తిచేసి వచ్చేసరికి టిఫిన్, కాఫీలతో రెడీగా వుంది రాజ్యం! రేగిన జుట్టు, చెమటకు తడిసి ముక్కుమీద కారిన కుంకుమ, నీళ్ళతో తడిసిన బట్టలు- ఆమె అవతారం చూసి మరింత చివుక్కుమంది అతని మనసు. తనతో పెళ్ళికాకపోయి వుంటే యింతకంటే హాయిగా ఆమె తల్లిదండ్రుల దగ్గర వుండేదేమో అనుకున్నాడు.

"ఏంటి? ఉదయం నుండి హడావిడి?" అడిగాడు.

"హడావిడా? హడావిడేమీ లేదు! రోజూ ఉండే పనే కదా? మీ చెల్లెళ్ళు లేచారంట! వాళ్ళు లేచేసరికి బెడ్ కాఫీలు ఇవ్వడం లేటైందని మీ అమ్మగారు దెబ్బలాడారు!" అంది.

"మా చెల్లెళ్ళు బెడ్‌కాఫీలు తాగందే బెడ్ దిగరంట?" వెటకారంగా అన్నాడు.

"ప్రతిరోజూ జరుగుతూన్నదదే కదండీ!" అమాయకంగా అంది.

"రేపొద్దున్న పెళ్ళై అత్తారింటికెళ్ళితే అక్కడెవరిస్తారంట బెడ్ కాఫీలు?" కోపంగా అడిగాడు.

"అందుకే చాలా డబ్బున్న సంబంధాలు చూడాలని మీ అమ్మగారు అంటున్నారు."

"ఓహో! కట్నాలు ఎక్కడ్నుంచి తెస్తుందంట? వాళ్ళాయన ఏమన్నా సంపాదించి పెట్టాడా? పెడితే ఇవ్వమను. తీసి చేస్తాను వాళ్ళ పెళ్ళిళ్ళు! ఆశక్కూడా ఓ అంతుండాలి. మనం మధ్యతరగతి కుటుంబాల్లో పుట్టి పెద్దింటి సంబంధాలు చేయాలని కోరుకోవడం అవివేకమే కాదు మూర్ఖత్వం కూడా అవుతుందని మీ అత్తగారితో చెప్పు!" కోపంగా అన్నాడు.

"ఇప్పుడా విషయాలన్నీ ఎందుకులెండి? ముందు టిఫిన్ చేయండి!"

లక్ష్మీకాంతం టిఫిన్ చేసి తన రూమ్ బయటకొచ్చాడు. అతనొచ్చేసరికి హాలులో టి.వి. ఆన్ చేసే వుంది. పైన ఫ్యాన్ తిరుగుతోంది. ఎవ్వరూ లేరు. సూర్యకిరణాలు ఇంట్లో పడుతున్నా లైట్లు వెలుగుతూనే వున్నాయి. అతను కోపంగా అవన్నీ ఆఫ్ చేసాడు. అప్పుడే అతని తల్లి లక్ష్మీబాయమ్మ వచ్చింది.

"ఏంటమ్మా? ఇక్కడెవరూ లేరు! అయినా లైట్లు వెలుగుతూనే వున్నాయి. ఫ్యాన్ తిరుగుతోంది! టి.వి ఆన్‌లో వుంది. ఇలా అయితే ఎంత కరెంటవుతుందో తెలుసా! కరెంట్ బిల్లు వేలల్లోకాక వందల్లో వస్తుందా? ఎంతకని మీకు చెప్పాలి? చెప్పి చెప్పి విసుగు పుడుతోంది." కోపంగా అన్నాడు.

"అనరా! అను! నీ మాటలు పడ్డానికే మేం బతికున్నాం! మీ నాన్నగారు సంపాదించే రోజుల్లో ఎలా గుండేది మన యిల్లు? ఏమూల చూసినా డబ్బే! బంగారం రాశులు పోసినట్లుండేది. ఇంట్లో ప్రతిరోజూ బంధువులతో నిండిపోయి వుండేది. ఎంత తినేవాళ్ళో, ఎంతమంది తినేవాళ్ళో లెక్కేలేదు. మరిప్పుడు అంత లెక్కప్రకారం! నువ్వు పోషిస్తున్నావు కాబట్టి అన్నేసి మాటలంటున్నావ్!" ముక్కు చీదుతూ అంది.

"అమ్మా! 'తాతలు నేతులు తాగారు..' అన్న సామెత గుర్తు చేయవద్దు. అప్పుడలా చేయబట్టే ఇప్పుడిలా వున్నాం! లేకపోతే ఇంకా హాయిగా, ఆనందంగా వుండేవాళ్ళం. నాన్నగారి సంగతి వదిలేయ్! అంతేకానీ లేనిపోని ఆశలకు పోవద్దు. నేను తెచ్చిన జీతంతో సరిపెట్టడానికి ప్రయత్నించు! నీ కూతుర్లు తెల్లారితే బెడ్‌కాఫీ లేందే మంచం దిగరా?!"

"అదేంట్రా అలాగంటావ్? వాళ్ళకెప్పట్నుంచో ఆ అలవాటుంది!"

"లేదు. నువ్వు అలవాటు చేసావ్! వాళ్ళు మరొకరింటికి వెళ్ళాల్సిన వాళ్ళు! వాళ్ళకిలాంటివన్నీ అలవాటు చేస్తే రేపొద్దున్న అక్కడవన్నీ జరగకపోతే వాళ్ళక్కడ ఇమడలేరు!"

"అంటే ఇప్పుడేమంటావ్?"

"వాళ్ళకు పనీపాటా నేర్పించు! వాళ్ళు పుట్టింది మిడిల్‌క్లాస్‌లో అని గుర్తుచెయ్!"

"అంటే వాళ్ళు అలాగే వుండిపోవాలనా నీ ఉద్దేశం? వాళ్ళకు పెద్దింటి సంబంధాలు రాకూడదా? గొప్పవాళ్ళతో పెళ్ళిళ్ళు జరగకూడదా? అక్కడ ఇలాంటి అలవాట్లు లేకపోతే వాళ్ళ అత్తగారిళ్ళలో ఎంత అవమానమో అది ఆలోచించావా?"

"అమ్మా! ఇదేమీ బ్రహ్మవిద్య కాదు. వాళ్ళ అదృష్టం బాగుండి పెద్దిళ్ళకెళితే అలవాటు చేసుకోవడం పెద్ద గొప్పేమీకాదు. కానీ, ఇక్కడవన్నీ వద్దంటున్నాను." అన్నాడు.

గొడవింకా పెద్దదవుతుందేమోనని భయపడిన రాజ్యలక్ష్మి "ఏవండీ, ఆఫీసుకు టైమవుతోంది." అంది.

అప్పుడు వాచీ చూసుకుని గబగబా బయలుదేరాడు లక్ష్మీకాంతం.

అతనటు వెళ్ళంగానే యిటు తిరిగి "ఏయ్ నంగనాచీ తుంగబుర్రా? చెప్పాల్సినవన్నీ మొగుడికి చెప్పేసి మళ్ళా ఏం తెలీనట్లు నాటకం ఆడుతావా?" కోపంగా అంది లక్ష్మీబాయమ్మ.

"నేనేం చెప్పానత్తయ్యా?" అమాయకంగా అంది.

"అవును! నువ్వేమీ చెప్పకపోతే వాడలా మాట్లాడడు. వాడెంతో మంచివాడు. నువ్వే వాడికి లేనిపోనివి కల్పించి చెప్పి వాడి మనసు విరిచేస్తున్నావ్!" కోపంగా అంది.

"ఏం మాటలత్తయ్యా అవి? నేనేం చెప్పలేదు." ఏడుపొక్కటే తక్కువ రాజ్యానికి.

అంతలో పక్కింటి పార్వతమ్మ రావడంతో ఆ సంభాషణ ఆగిపోయింది.

• • •

రాత్రి ఏడింటికి రెండు బస్సులు మారి యింటికొచ్చాడు లక్ష్మీకాంతం. వస్తూనే, "రాజ్యం! కాఫీ!" అంటూ తన రూమ్‌లోకెళ్ళిపోయాడు. ఐదు నిమిషాల్లో కాఫీ కప్పుతో ప్రత్యక్షమైంది రాజ్యం.

ఉదయం స్నానం చేసి కట్టుకున్న చీర, రేగిన జుట్టు, ముడి కూడా తీయలేదు. పైట నడుంకు బిగించి కట్టివుంది. ఒక్కసారిగా మనసు బాధతో మూల్గింది. తర్వాత కోపం కూడా వచ్చింది.

"ఏంటి? ఉదయం వెళ్ళినప్పుడు ఎలాగున్నావో ఇప్పటికీ అలాగే వున్నావ్! ఉదయం నుండి ఇప్పటివరకు కనీసం జడ వేసుకోడానిక్కూడా టైములేదా?"

అడిగాడు.

''ఉదయం అందరికీ కాఫీలు, టిఫిన్లు అందించి, వంట చేసేసరికి పన్నెండైంది. మధ్యాహ్నం నుండి బట్టలు ఉతికాను. అది చేసి వచ్చేసరికి మళ్ళా కాఫీలు టిఫిన్లు.''

''ఏంటి? మధ్యాహ్నం కూడా టిఫిన్లు చేస్తున్నావా?'' అడిగాడు.

''మీ నాన్నగారు పేకాట యింట్లో పెట్టారు. అందుకని వాళ్ళందరికీ కాఫీలు, టిఫిన్లు...! చెయ్యకపోతే మీ అమ్మగారు దెబ్బలాడుతున్నారు.''

''దెబ్బలాడుతుంది! ఎందుకు దెబ్బలాడదు? వండిపెట్టేవాళ్ళు, సంపాదించి పెట్టేవాళ్ళు ఉన్నంతవరకు దెబ్బలాడక ఏం చేస్తుంది? నాన్న పేకాట పారాయణం యింట్లోనే పెట్టాడా? ఛ..ఛ.. ఎప్పటికి బాగుపడతారు వీళ్ళు?'' అని విసుక్కున్నాడు. తర్వాత తనే ''ఆ సంగతలా వుంచు ఇప్పుడైనా తయారవ్వవచ్చు కదా?'' అడిగాడు.

''ఇంకా పనెక్కడైందండి? రాత్రికి వంట చేస్తున్నాను. ఉదయం ఇడ్లీకి నానబెట్టాను. అది రుబ్బాలి?'' అంది.

లక్ష్మీకాంతానికెక్కడలేని కోపం వచ్చింది. తనమీద తనకే అసహ్యం వేసింది. తనను తాను నిందించుకుంటూ బాత్‌రూమ్‌లోకి దూరాడు.

• • •

రాత్రి భోనాలయ్యాక సుమారు పదకొండున్నరకు చేతులు తుడుచుకుంటూ వచ్చింది రాజ్యలక్ష్మి.

అప్పటివరకూ చూసి చూసి అప్పుడే నిద్రపోడానికి సిద్ధపడుతున్న లక్ష్మీకాంతం ఆమెను చూసి లేచి కూర్చున్నాడు.

''ఇప్పటికైందా పని?'' అని అడిగాడు.

''ఊ '' అంటూ నడుం వాల్చింది. ఉదయం నుండి కనీసం కూర్చోనైనా కూర్చోకుండా పని చేసినందుకు నడుం ఒక్కసారిగా కలుక్కుమంది. ''అమ్మా!'' అంది ఒక్కసారిగా.

ఆమె పక్కనే తనూ నడుం వాలుస్తున్న లక్ష్మీకాంతం ''ఏంటి? ఏమైంది?'' అడిగాడు.

''నడుం నొప్పెట్టింది!'' అంది.

వెళ్ళి అయిడెక్స్ తెచ్చి రాసాడు. కొంచెం ఉపశమించింది.

''సారీ రాజ్యం! నీకేవిధమైన సుఖాన్నీ ఇవ్వలేకపోతున్నాను. ఐ యామ్ రియల్లీ సారీ.'' అన్నాడు బాధపడుతూ.

''ఛ! అవేం మాటలండీ?'' నొచ్చుకుంటూ అంది రాజ్యలక్ష్మి.

''మీ అమ్మానాన్నలు నిన్నెంత గారాబంగా పెంచారో నాకు తెలుసు! పెళ్ళై సంవత్సరం కావస్తున్నా నీకేవిధమైన సంతోషాన్ని, ఆనందాన్ని యివ్వలేకపోతున్నాను. మావాళ్ళు నిన్నింత రాచి రంపాన పెడ్తారని అనుకోలేదు. లేకపోతే పెళ్ళైన వెంటనే వేరే కాపురం పెట్టేసేవాణ్ణి!'' అన్నాడు.


''పెళ్ళికావాల్సిన ఆడపిల్లలున్నారు! మనం వేరే కాపురం పెడితే నల్గురూ ఏమనుకుంటారు?''

''అందుకని వాళ్ళకు సేవలు చేస్తూ ఒళ్ళు గుల్ల చేసుకుంటావా? చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళయ్యేవరకు మనం పిల్లలు వద్దనుకుని కుటుంబ నియంత్రణ పాటిస్తున్నాం! ఆ విషయం తెలీక ఇంకా నీ కడుపు పండలేదని మొన్న మా అమ్మ నానా మాటలూ అనడం విన్నాను! నిన్ను అంతలేసి మాటలంటున్నా నువ్వు నోరు మెదపలేదెందుకు?'' కించిత్ కోపంగా అన్నాడు.

''ఆవిడ అన్నారని నేనూ నోరు పెడితే గొడవ పెరగడం తప్ప తగ్గదు. కానీ దానివల్ల ప్రయోజనం వుందంటే ఏమాత్రం లేదు. అందుకోసం అనవసరంగా గొడవలు పడితే పోయేది మన పరువే!''

''అర్థం చేసుకునే భార్య దొరకడం నిజంగా నా అదృష్టం. ఎంతమంది భార్యలు నీలా ఆలోచిస్తున్నారు? నిజంగా నేను చాలా అదృష్టవంతుడ్ని!'' అన్నాడు ఆమెను అక్కున చేర్చుకుంటూ.


''మీరింత మంచివారు కాబట్టే నేను ఇన్ని బాధలు సహించగల్గుతున్నాను. మీరు నాపట్ల చూపే ప్రేమ, ఆప్యాయత నాకు చాలండి! వాటితో ఆనందంగా జీవించేస్తాను.'' అంది అతన్ని మరింత గట్టిగా కౌగిలించుకుంటూ.



• • •

ఆరోజు శెలవని యింట్లోనే వున్నాడు లక్ష్మీకాంతం. ప్రతిరోజూలానే చెల్లెళ్ళు తొమ్మిదింటికి లేచారు. తమ్ముడు ఇంకా లేవనేలేదు. తల్లి ఆ మాట ఈ మాటా మాట్లాడుతూ ''ఒరేయ్ లక్ష్మీ! ఊర్లో స్వాములవారు వచ్చారంట! ఆయన పర్వతాల్లో తపస్సు చేసి వచ్చినవారంట! అతనేది చెబితే అది జరిగిపోతుందట! అతన్ని పిలిచి భోజనం పెడితే మనకెంతో మంచి జరుగుతుందని చెప్పింది మన పక్కింటి పార్వతమ్మ. అదీకాక ఆయనేవో తాయెత్తులు ఇస్తారంట! అవి కట్టుకుంటే పెద్దింటి సంబం

## 'కుబుసం' శ్రీహరి



శ్రీహరి ఏం చేసినా వెరైటీనే. ప్రజలంతా సమానంగా ఎందుకు ఉండడంలేదు, అంతా సమానమే అన్న ఆలోచనకు రూపమే 'కుబుసం' చిత్రమట. దాదాపు మూడు సంవత్సరాలు ఈ స్క్రిప్ట్ వర్క్‌లో కూర్చుని రీసెర్చ్ చేసి నాటకాలుగా వేసి ఇప్పుడు సినిమాగా రూపొందిస్తున్నారు. అయితే విశేషం ఏమిటంటే ఈ పాత్రకు ముందుగా నసీరుద్దీన్‌షాని అనుకున్నారట. అతని ఫారిన్ ట్రిప్ కారణంగా కేవలం మూడురోజులు మాత్రమే డేట్స్ ఇస్తాననడం వలన శ్రీహరిని బుక్ చేశారుట. ఏది ఏమైనా శ్రీహరి పూర్తి విశ్వరూపం ఈ సినిమాలో చూడొచ్చుట! ప్రేక్షకులూ బి రెడీ!

\- ప్రియ

ధాలు వచ్చి పెళ్ళిళ్ళు అవుతాయంట.''

''అయితే ఇప్పుడేవంటావమ్మా?''

''అదికాదురా! మీ చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు చేసేద్దామనుకుంటున్నాం కదా! అందుకని ఆ స్వాములవారిని పిలిస్తే...'' నసిగింది.

''ఊ! పిలిస్తే...''

''పిలిస్తే మనకు మంచిదని...''

''అయితే పిలు..!'' అన్నాడు.

''అబ్బా! ఎంత చల్లటి మాట చెప్పావ్‌రా!'' అంది.

''పిలిస్తే అయ్యే ఖర్చు మాట చెప్పు!'' అన్నాడు లక్ష్మీకాంతం తండ్రి జగన్నాథం.

''ఖర్చా! ఖర్చేవిటి?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''అదేంట్రా అలాగంటావ్? మనింటికి స్వాములవారు వస్తే వీధిలో జనం రారా ఏవిటి? మన బంధువులు, చుట్టాలు అందరూ వస్తారు. వాళ్ళందరికీ భోజనాలూ అవీ...'' అంటూవుండగానే ''అమ్మా!'' గట్టిగా అన్నాడు లక్ష్మీకాంతం.

ఉలిక్కిపడ్డారిద్దరూ.

''అమ్మా! నీకేమైనా బుద్ధుందా? ఇంత వయసొచ్చింది! సంసారం ఎలా నడపాలో తెలీదా? అసలు నన్నేవనుకుంటున్నావ్? రిజర్వ్ బ్యాంక్ అనుకుంటున్నావా?'' కోపంగా అన్నాడు.

''అనరా అను. చూడండి! వాడు ఎన్నేసి మాటలంటున్నాడో? మనం పెంచి పోషించకపోతే ఇంత వాడయ్యేవాడా?''

''ఏంటమ్మా! ఏంటి మాట్లాడుతున్నావ్? మీరు నన్నేమీ చదివించారా? స్కాలర్‌షిప్‌లతోనే చదువుకున్నాను. ఒక్కసారైనా మీరు నాకు బట్టలు కొన్నారా? పార్ట్‌టైం ఉద్యోగాలు చేసుకుంటూ నా బట్టలు నేనే కుట్టించుకునేవాణ్ణి! కేవలం నాల్గు జతల బట్టలతో నా కాలేజీ జీవితం మొత్తం గడిపేసాను! ఎంత డబ్బైనా నాన్న దురలవాట్లకే సరిపోయేది. ఎలాగో ఈ బ్యాంక్ ఉద్యోగం దొరకడంతో లోన్లు పెట్టి నానమ్మ ఇచ్చిన ఆస్తిలో మిగిలిన పెంకుటింటిని డాబా చేసాను. దాని మీద యిళ్ళు కట్టి అద్దెలు వచ్చేట్టు చేసాను. ఇంకా ఏం చేయాలి? ఇప్పటివరకూ నా భార్యకొక చీరైనా కొనివ్వలేదు. చిన్న నగైనా చేయించలేదు. తను మంచిది కాబట్టి సర్దుకుపోయే మనస్తత్వం ఉన్నది కాబట్టి మీరెన్ని వేషాలేసినా సర్దుకుపోతోంది.'' అన్నాడు కోపంగా.

''నీతో మాటలు పడాలని రాసుంది. ఏం చేస్తాం? మీ నాన్న సంపాదించిందంతా అలా తగలేసి వుండకపోతే మాకీ గతి పట్టేదేకాదు'' ముక్కు చీదుతూ అంది.

ఆరోజు సెలవైనందుకు మరింత బాధ పడుతూ వీధిలోకెళ్ళిపోయాడు లక్ష్మీకాంతం.

● ● ●

వారం రోజుల తర్వాత... అతను ఇంటికొచ్చేసరికి ఇల్లంతా హడావిడిగా వుంది. హాలులో కుర్చీలో స్వాములవారు కూర్చుని వున్నారు. ఎలాగో దారి చేసుకుని లోనికొచ్చాడు. లోపల వంటింట్లో రాజ్యలక్ష్మి ఆపసోపాలు పడుతోంది. వంటంతా ఆమె మీదే వేసేసారు. అన్నీ వండి పెడుతోంది. గుండెనెవరో పిండినట్లైంది.

ఏం చేయలేని పరిస్థితి! తన రూమ్‌లోకెళ్ళాడు. అక్కడంతా జనం! మళ్ళీ వీధిలోకెళ్ళి రాత్రికి తిరిగొచ్చాడు.

రాజ్యలక్ష్మి అప్పుడే పనంతా ముగించుకుని వచ్చింది.

''ఏంటి హడావిడి?'' అడిగాడు.

''స్వాములవారంట! మీ అమ్మగారు పిలిచారు.'' అంది.

''డబ్బెక్కడివంటా?''

''ఏమోనండి! నాకు తెలీదు!''

గబగబా వరండాలోకెళ్ళాడు. అక్కడ అతని తల్లిదండ్రులిద్దరూ కూర్చుని తాంబూలం వేసుకుంటూ తీరిగ్గా మాట్లాడుకుంటున్నారు.

''అమ్మా!''

''ఏంట్రా?'' నింపాదిగా అంది.

''ఇవన్నీ చేయడానికి డబ్బెక్కడిది?''

''అప్పుచేసాను'' తేలిగ్గా చెప్పింది.

''మళ్ళా ఎలా తీరుద్దామని?''

''అంటే.. ఏంట్రా? నీ ఉద్దేశం? నువ్వు తీర్చవా?''

''నాకేం సంబంధం?''

''అదేంట్రా అలాగంటావ్?''

''ఏంటమ్మా నువ్వు అప్పులు చేస్తుంటే నేను తీరుస్తూ వుండాలా? అయినా యిలా దుబారా ఖర్చులు చేస్తుంటే నేనెలా ఈ సంసారాన్ని ఈదగలననుకున్నావ్?''

''చూడండి! వాడు ఎన్నేసి మాటలంటున్నాడో? అయినా యిదంతా మీ వల్లనే వచ్చింది.'' అంది.


''మధ్యలో నేనేం చేసానే?'' అన్నాడు జగన్నాథం.

''మీరేగనక లక్షలు సంపాదించివుంటే వాడీరోజు ఇన్ని మాటలనేవాడా? మనం పడేవాళ్ళమా?''

''భర్త ఎంత సంపాదించినా నీలా దుబారా ఖర్చు చేసే భార్య వుంటే ఎంతైనా సరిపోదు.'' కోపంగా అని లోనికెళ్ళిపోయాడు లక్ష్మీకాంతం.

● ● ●

మరో పది రోజుల తర్వాత ఆఫీసు నుండి యింటికొచ్చేసరికి ఇంట్లో కొత్త సామాను కన్పించింది. ఏంటని చూస్తే అది ఫ్రిజ్! ఫ్రిజ్ ఎవరు కొన్నారని ఆశ్చర్యంగా చూస్తుండగానే లక్ష్మీబాయమ్మ వచ్చి ''ఫ్రిజ్ కొన్నాను! బాగుందా?'' అని అడిగింది.



''డబ్బు...'' అంటూ వుండగానే ''ఇన్‌స్టాల్‌మెంట్‌లో తెచ్చానురా.'' అంది.

''ఇన్‌స్టాల్‌మెంటా? ఏంటమ్మా? నువ్వు మతుండే ఈ పనులన్నీ చేస్తున్నావా?''

''ఏంచేసాన్నేను?''

''పోయిన నెల కలర్ టి.వి. కొన్నావ్! ఈనెల ఫ్రిజ్! ఇలాగైతే ఎలాగమ్మా?'' బాధగా అన్నాడు.

''అసలివన్నీ నీ అత్తమామలు లాంఛనాల రూపంలో ఇవ్వాలి. నువ్వేమో ఇవన్నీ వద్దన్నావ్! మరి నేనైనా కొనాలి కదా?''

''దీన్ని కొనడం అంటారా?''

''ఎలాగో ఒకలా వస్తువు మనింటికొచ్చింది కదా? రేప్పొద్దున్న నీ చెల్లెళ్ళని చూడ్డానికి పెళ్ళివారొస్తే మనింట్లో కనీసం టి.వి., ఫ్రిజ్‌లన్నా లేకపోతే అట్నుంచి అటే పారిపోతారు'' అంది.

''అందుకని ఇన్‌స్టాల్‌మెంట్‌లో కొనాలా? నీకెన్ని సార్లు చెప్పాను. మనమెంతలో వుండాలో అంతలోనే వుండాలని! నా జీతమంత ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టడానికే సరిపోయేలా వుంది.'' అని విసుక్కుంటూ లోనికెళ్ళి పోయాడు.

• • •

లక్ష్మీకాంతం తెచ్చిన మిడిల్‌క్లాస్ సంబంధాలు చేయనని ఖరాఖండిగా చెప్పింది లక్ష్మీభాయమ్మ. తన కూతుర్లు చాలా అందగత్తెలని వాళ్ళకు గొప్పింటి సంబంధాలు వెతుక్కుంటూ వస్తాయని చెప్పింది. దాంతో మరింత విసుగు చెందాడు లక్ష్మీకాంతం.

• • •

ఆరోజు ఉదయం లేస్తూనే అలవాటు ప్రకారం ''ఒసేయ్ రాజ్యం ఎక్కడ చచ్చావే! మా మొఖాన కాఫీ నీళ్ళు పోసేదేమైనా వుందా?'' కేకవేసింది లక్ష్మీబాయమ్మ.

కాఫీ రాలేదు. మరోసారి కేకవేసింది. అసలు వస్తున్న జాడ కూడా కన్పించలేదు. ఓ పావుగంట చూసి ఇల్లంతా వెదికింది. కొడుకు, కోడలు కూడా కన్పించ లేదు. ఆ విషయమే భర్తతో చెప్పింది. అతను కూడా వెదికాడు. ఎక్కడా వాళ్ళ జాడలేదు. అంతా వెతికి హాల్లోకొచ్చేసరికి టి.వి. స్టాండ్ దగ్గర ఓ ఉత్తరం కన్పించింది. ఆత్రుతగా దాన్ని తీసి చదివాడు.

అమ్మా నాన్నలకు నమస్కారం!

నాన్నగారూ! ఏ కుటుంబానికైనా తండ్రి మూల స్తంభం లాంటివాడు. అటువంటి మీరే దురలవాట్లకు లోనై ఉన్న ఆస్తిని పాడుచేసారు. ఎలాగో ఈ ఇల్లన్నా మిగిలినందుకు సంతోషించండి! ఇకపోతే అమ్మ మీకు తగ్గ భార్య. దుబారాలో ఆమె తర్వాతే ఎవరైనా! ఆమె లాగే కూతుర్లను కూడా తయారుచేసింది. ఏ మనిషైనా తనేవిటో తన తాహతేవిటో, తన అంతస్తేవిటో తెలుసుకుని మసలగల్గితేనే మనుగడ కొనసాగించగలడు. మీ యింట్లో నేను పుట్టడమే తప్పు! మీలాంటి వాళ్ళ యిళ్ళలో నాలాంటి కొడుకులు పుట్టకూడదు. పుడితే వాళ్ళంత దురదృష్టవంతులు మరొకరుండరు. ప్రతీది వాళ్ళ భుజాల మీదే వేయడానికి చూస్తారు. రాబందుల్లా పీక్కుతింటారు. నన్ను చేసుకున్న పాపానికి నా భార్యకు నేను ఏ విధమైన సుఖాన్ని ఇవ్వలేకపోయాను. ఏ భార్యైనా పెళ్ళిచేసుకుని తనను కన్నవాళ్ళని, ప్రేమగా చూసేవాళ్ళని వదులుకుని కట్టుకున్నవాడివెంట ఎందుకొస్తుంది? అతను తనను అన్నివిధాలా సుఖసంతోషాలను పంచి ఇస్తాడని, ఏ కష్టం లేకుండా జీవితాన్ని పంచి ఇస్తాడని! కానీ నా భార్య చేత వెట్టిచాకిరీ చేయించారు. తనను పనిమనిషి, వంటమనిషి, చాకలి.. ఒకటేంటి.. అన్నీ చేసారు. అయినా ఏనాడు నోరు మెదపలేదు. పెళ్ళైన దగ్గర్నుండి మేమిద్దరం ఇప్పటివరకు సినిమాకైనా, షికారుకైనా వెళ్ళడం మీరు చూసారా? చెప్పండి నాన్నా? ఇది కాక అమ్మ ఆశకు అంతులేదు. ఏ రాకుమారులో వచ్చి తన కూతుళ్ళను పెళ్ళి చేసుకుంటారన్న భ్రమలో వుంది. కూతుర్లను కూడా అదే భ్రమలో వుంచింది. ఆ భ్రమలో నుండి మీరంతా ఎంత త్వరగా బయటకు రాగల్గితే అంత మంచిది. ఇకపోతే నా విషయం- నన్ను బ్యాంక్ తరపున బ్యాంక్ వాళ్ళే ఫారిన్ పంపిస్తున్నారు. అక్కడే ఉద్యోగం. ఈ విషయం ఆర్నెల్లక్రితమే డిసైడ్ అయింది. రాజ్యానిక్కూడా వీసా పాస్‌పోర్ట్ తీసుకున్నాను. ఇద్దరం కలిసి ఫారిన్ వెళ్ళిపోతున్నాం. మీకు ఇల్లు కట్టిచ్చాను: అద్దెలొస్తాయి. మీ పెన్షన్ వస్తుంది. చెల్లెళ్ళిద్దరి పేరున చెరో లక్ష రూపాయలు బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్స్ చేసాను. తమ్ముడి పేరున ముప్పైవేలు వేసాను. అది వాడి చదువుకి పనికొస్తుంది. ఎప్పుడు వాళ్ళ పెళ్ళిళ్ళు కుదిరితే, అదే, మీరనుకున్న సంబంధాలు వచ్చి పెళ్ళిళ్ళు చేస్తే అప్పుడే ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు తీసి వాడుకోండి. అవి కూడా ఈ కవర్‌లోనే వున్నాయి. మీ పెన్షన్ ఇంటద్దెలతో మీరు పొదుపుగా సాగిస్తే సంసారం హాయిగానే గడిచి పోతుంది. దుబారా ఖర్చులు, పేకాట పారాయణాలు కొనసాగిస్తే ఉన్న ఆ ఇల్లు కూడా పోయి రోడ్డున పడవలసి వస్తుంది. తర్వాత మీ ఇష్టం. అంతా మీ చేతుల్లోవుంది. ఇప్పటివరకు నేను కొడుకుగా నా బాధ్యత నేను నెరవేర్చాననే అనుకుంటున్నాను.

ఇక భర్తగా నా బాధ్యత నెరవేర్చవలసి వుంది. అందుకే నా భార్యతో పాటు నేను ఫారిన్ వెళ్ళిపోతున్నాను. మీలా ప్రవర్తించే తల్లిదండ్రులకు నా లాంటి కొడుకులు ఇంతకంటే ఏం చేయలేరు.

ఇట్లు
లక్ష్మీకాంతం.

★

# టైమ్



ఒకావిడ పక్కింటావిడతో మాట్లాడుతూ- ''అప్పుడే తొమ్మిదయింది. ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయి. పిల్లల్ని స్కూలుకి పంపాలి. ఈయనకు బాక్సు సర్దాలి. ఈ టైమెలా ఆగుతుందో తెలిడంలేదు'' అంది.

అప్పుడు పక్కింటివాళ్ల అయిదేళ్ల పాప ''అయ్యో ఇది కూడా తెలీదా ఆంటీ. బ్యాటరీ తీసేస్తే సరి!''

-కె.వి.ఆర్.కె.మూర్తి (గుంటూరు)

# పని

''ఏమోయ్ రామారావు! నీ గురించి అప్పారావేంటి అలా వాగుతున్నాడు?'' అన్నాడు వెంకట్రావు.

''ఏం వాగుతున్నాడేంటి?''

''మొన్న వాడు నీ ఇంటికొచ్చినప్పుడు నువ్వు వంట చేస్తున్నావట?''

''అంతా అబద్ధం. వంట పనంతా పూర్తిచేసి బట్టలుతుకుతున్నా'' అని చెప్పి నాలిక కరచుకున్నాడు రామారావు.

# అబద్ధం

''మీ ఆవిడ పరమ గయ్యాళట. అన్ని పనులు నీచేతనే చేయిస్తుందట. ఒక్క పని కూడా ఆమె చేయదట. నిజమేనా గోపాలం'' అడిగాడు వేణు.

''అంతా అబద్ధం. నేను మా ఆవిడకు వంట చేసి డైనింగ్ టేబుల్‌మీద మొత్తం సర్దితే తాగడానికి కావాల్సిన మంచినీళ్ళు ఆవిడే పెట్టుకుంటుంది తెలుసా?'' ఆవేశంగా చెప్పాడు గోపాలం.

# కొత్త చెప్పులు

''రామూ! రోజుకో కొత్త చెప్పుల జత వేసుకొస్తున్నావు. చెప్పుల షాపుగానీ పెట్టావేంటి?'' అడిగాడు వాసు.

''లేదురా. మేము ఇల్లుమారాం. మాఇంటి పక్కనే గుడి ఉందిలే'' అసలు సంగతి చెప్పాడు రాము.

- వాయిగండ్ల మురళీకృష్ణ (ఒంగోలు)

